














నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025


వివిధ ఆకృతులలో ఆకర్షిస్తున్న కేక్‌లు


మార్కెట్‌లో కేక్‌లను కొనుగోలు చేస్తున్న ప్రజలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పూల బొకేలు

నూత్న వత్సరమా... స్వాగతం

తెనాలిరూరల్: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి సంతోషాల నడుమ స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం చేసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని బేకరీలలో వివిధ ఆకృతులలో కేక్‌లు అబ్బురపరుస్తున్నాయి. పలు బేకరీలు మార్కెట్‌లో స్టాళ్లను ఏర్పాటు చేయగా ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పూల దుకాణాల నిర్వాహకులు దండలు, బొకేలను సిద్ధం చేశారు. రంగవల్లుల కోసం రంగులు, సంబరాల కోసం కేక్‌లు, స్వీట్ల కొనుగోలుదారులతో మార్కెట్ ప్రాంతంలో సందడి నెలకొంది.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ నాగలక్ష్మి



తెనాలిరూరల్: ప్రజల భూ సంబంధిత సేవలు సమస్యలు ఫిర్యాదులను వారి వద్దకే వచ్చి పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సూచించారు. గత నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మంగళవారం తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలోని ఏవీకే కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సదస్సులో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పావార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో కలసి పాల్గొన్నారు సదస్సులో అర్జీలు తీసుకుంటున్న విధానాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను, గ్రామ మ్యాపులను రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి చూసి వారి అర్జీలపై రిమార్కులు నమోదు చేసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 18 మండలాల్లో 222 గ్రామాలలో రైతు సదస్సులు నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు 3452 అర్జీలు వచ్చాయని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

దావులూరు(కొల్లిపర): గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవటానికి రైతులకు చక్కని వేదికని తహసీల్దారు జి.సిద్ధార్థ అన్నారు. కొల్లిపర మండలంలోని దావులూరులో మంగళవారం రెవెన్యూ సదస్సునిర్వహించారు. సదస్సులో భూముల ఆన్‌లైన్, కొత్తపాస్ పుస్తకాల మంజూరుకు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాన్ని సరి చేసేందుకు రైతులు అర్జీలు అందజేస్తే నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

రోడ్ల మరమ్మతుల్లో నాణ్యతా లోపాలు

కౌన్సిల్ సమావేశంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన సభ్యులు

తెనాలిరూరల్: పట్టణంలో జరుగుతున్న రోడ్ల మరమ్మతులలో నాణ్యత లోపించిందని, కాంట్రాక్టర్ల వద్ద కమీషన్‌లకు అలవాటు పడిన అధికారులు పనులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ సయ్యద్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సభ్యులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గడిచిన ఏడాదిలో పట్టణ అభివృద్ధికి సహకరించిన అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అజెండాలో పొందు పరిచిన 62 అంశాలతో సాధారణ సమావేశం ప్రారంభం కాగా పలు విషయాలకు సంబంధించి సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న రోడ్ల ప్యాచ్ వర్క్‌లు నాణ్యత లేవంటూ కౌన్సిలర్లు త్రిమూర్తి, దేసు యుగంధర్, వైస్ చైర్ పర్సన్ అత్తోట నాగవేణి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, దాసరి వీర వసంత రావు, షేక్ ఇస్మాయిల్ తదితరులు ప్రశ్నించారు. వార్డుల్లో పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని అధికారుల పనితీరు బాగాలేదని కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లకు కక్కుర్తి పడి పనులను పట్టించుకోవడం లేదంటూ టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి ఆరోపణలు చేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు వివరణ ఇచ్చారు. పనులు పర్యవేక్షణ చేయిస్తామని తెలిపారు. అదే విధంగా గత ప్రభుత్వంలో గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పలు అభివృద్ధి పనులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం అజెండాలో కొన్ని అంశాలు చర్చకు రాగా 11వ అంశంలో ఉన్న గాంధీపార్కు కాంపౌండ్ లోపల టెంపరరీ షాపులు నిర్మించాలన్న అంశాన్ని వాయిదా వేసి మిగిలిన అన్ని అంశాలు ఆమోదించినట్లు ప్రకటించారు. అనంతరం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ అజెండాలో ఒకటి మినహా అన్నింటిని ఆమోదించడం జరిగిందని చెప్పారు.

ఎరువుల పంపిణీని తనిఖీ చేసిన మంత్రి మనోహర్

తెనాలిరూరల్: తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెటింగ్ శాఖ ద్వారా జరుగుతున్న ఎరువుల పంపిణీని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం పరిశీలించారు. మార్కెట్ యార్డు ఆవరణలోని ఎరువుల స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీ విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదులు రావడంతో స్వయంగా పరిశీలించేందుకు వచ్చారు. గోడౌన్‌లో ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీకి సంబంధించి పలువురు రైతులు మంత్రి నాదెండ్ల మనోహర్ ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎరువుల కోసం ఉదయం వస్తే సాయంత్రం వరకు మార్కెట్ యార్డులోనే ఉంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మార్కెటింగ్ శాఖ అధికారులపై మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చిన ఊరుకునేది లేదని హెచ్చరించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 2025 నూతన సంవత్సర క్యాలెండరును మంగళవారం సాయంత్రం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్ మేడికొండ, కోశాధికారి దాసరి విజయకుమార్, ఉప ప్రధాన క్యాదర్శి చందన, ప్రాంతీయ కార్యదర్శి శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

లాయర్స్ అసోసియేషన్..

తెనాలిరూరల్: తెనాలి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర కోర్టు కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక కోర్టుల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మందలపు వేణు గోపాలరావు గారు, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అప్పల కిషోర్, సీనియర్ న్యాయవాదులు ఎంఎల్ జగదీశ్వరాంబ, పెరికలా డానియల్, మహేష్, రమిసెట్టి రాఘవేంద్రరావు, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ సభ్యులు కంచర్ల కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు తిన్నాలూరి కొండయ్య గారు, ఇతర సభ్యులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎరువుల గురించి ఆందోళన వద్దు

తెనాలిరూరల్: ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ ఎరువులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి జి. ప్రేమ్‌సాగర్ తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండలంలోని మల్లెపాడు, సంగంజాగర్లమూడి గ్రామాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కజొన్నలో వచ్చే చీడపీడల గురించి వివరించి, నివారణ చర్యల గురించి తెలిపారు. రైతులు ఎరువులకు ఎటువంటి ఇబ్బంది పడకుండా మార్కెట్ యార్డులో ఎరువులు సరిపడా ఉండేటట్లు చూస్తున్నామని, రైతులందరూ ఎరువులు గురించి ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా

తెనాలిరూరల్: విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు నిరసనగా సేవ్ పవర్ సెక్టార్, సేవ్ ఇండియా డిమాండ్‌తో స్థానిక చెంచుపేటలోని విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ వీవీ చిరంజీవి మాట్లాడుతూ చండీఘర్‌లోని విద్యుత్ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామని, విద్యుత్ ప్రవేటీకరణకు తాము వ్యతిరేకమని చెప్పారు. సీఐటీయూ నాయకుడు కేబీ ప్రసాద్, ఏడీఈ బి. అశోక్‌కుమార్, ఏవో శ్రీనివాసరావు, ఆచారి, రోహిణి, రవి, శివనాగేశ్వరరావు, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, సరళ, మల్లేశ్వరి, సీఐటీయూ నాయకులు,షేక్ హుస్సేన్‌వలి, ఒ. రవికుమార్ పాల్గొన్నా రు.

2024లో నేరాలు తగ్గుముఖం

తెనాలిరూరల్: 2023తో పోలిస్తే 2024 సంవత్సరంలో సబ్ డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్లలో కేసుల సంఖ్య కొంత తగ్గాయని డీఎస్పీ జనార్ధనరావు పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం ఉదయం ఆయన తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశరావు, సిబ్బంది డీఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

















